# రామశాస్త్రి



★

రచన:

క్రొవ్విడి సూరి

★

రామశాస్త్రికి డెబ్భైయేళ్లొచ్చినా సంసారతాపత్రయం తప్పలేదు. అంత పెద్దతనంలో యింకా ఓ చేత్తో కఱ్ఱపట్టుకుని మరో చేత్తో యెండ వేడికి భరించలేకుండా ఉన్న బట్టతలని తడుముకుంటూ, అడుగులో అడుగు వేసుకొని వెచ్చటి గాల్పులో నడిచిపోయే ఆ వృద్ధుని చూస్తే యేరాతిగుండె కరగదు? పాపం శాస్త్రి నడిచి నడిచి చివరకి అలిసిపోయి త్రోవ ప్రక్కనున్న రావిచెట్టుక్రింద నీడలో విశ్రమించాడు. ఎంత ఓపికా, చేరవా లేకపోతే బ్రహ్మాండమైన గాల్పులో రెండుమైళ్లదూరానవున్న పొలానికిపోయి తిరిగి రాగలడు! ఆ వయస్సులో అతనికి, యెదిగొచ్చిన కొడుకు సహాయం చేస్తూంటే యెంత ఆనందపడేవాడు? అభాగ్యుడు! అతనికి ఆ అదృష్టం లేకపోయిందీ!! "ఇంతకీ వాడికి యింగ్లీషుచదువు చదివించటంవల్ల వచ్చింది నాకీదురవస్థ" అనుకుంటూ చెట్టుమొదలికి తనవంగిన వీపును బోర్లవేశాడు. అతనికి తన చిన్నప్పుడు జరిగిన విషయాలు ఒక్కొక్కటీ జ్ఞప్తికి తెచ్చుకుంటున్నాడు. ఒకసారి కుప్పనూర్పుల రోజుల్లో పొలం వెళ్ళనందుకు స్తంభానికి కట్టి స్వంతంగా పేనినతాడుతో తండ్రి, తనని కొడుతోంటే, "బాబోయ్ బాబోయ్" అని గంతులేస్తూ యేడుస్తూవుండడం. తల్లి తనదురవస్థకి కుమ్మంలో ఒకమూలగా కూర్చుని దుఃఖిస్తూ వుండడం ఆదృశ్యం అతనికి కళ్ళకి కట్టినట్టుంది. "ఈ వాళ యీ వెధవ అల్లా చెమ్డాలెక్క కొట్టివుంటే?" అంటూ తృప్తిపడి కూర్చున్నాడు. శాస్త్రికి కోపం కలిగింది. కాలిదగ్గర పైకిపొడుచుకొని వచ్చిన వేరు నొకదానిని చేతికఱ్ఱతో కసిదీర కొట్టిగాబాదాడు. ఆకసి ఆ వేరుమీదా లేకపోతే తన కొడుకుమీదా?

పాపం! అతనిమనస్సు యేదో వ్యథతో బాధపొందుతోంది. ఆ బాధకి సానుభూతి చూపుతున్నట్లుగా రావిచెట్టు నాలుగు పండుటాకుల్ని అతనిదగ్గరగా రాల్చింది! తల పైకెత్తి నిర్జీవమై వంకరటింకరగా సాగిపోతున్న ఆ పొంతదారి వైపు చూశాడు. "ఆ యెఱ్ఱతలపాగ చుట్టుకొని పరిగెత్తుకుంటూ వచ్చేవాడు వెంకన్నే కదూ? నాకోసమే వస్తూవుంటాడు. కన్నకొడుకక్కంటే ఆ నీక వేలరెట్లు యీ పాలేరే మెరుగు!" అనుకున్నాడు నిట్టూర్పుగా రామశాస్త్రి.

ఒగర్చుకుంటూ వెంకన్న శాస్త్రిదగ్గరికి పరుగెత్తుకొచ్చి "మీకోసమే బాబా వత్తా. పొద్దుట నూక లేసేతలికి అబ్బాయి యెక్కడకో పోనాట్ట బాబయ్యా. వణ్ణానికి కూడా రాలేదంట. ఇంటికాడ అమ్మ లబోలబో మంటోంది. ఇప్పు డేటి సేసేది?" ఇంకా ఆయాసంతో డొక్కలు పైకెగరేసుకుంటూ నిల్చున్న వెంకన్న మొగంలోకి నిర్ఘాంతపోయి చూచాడు రామశాస్త్రి. "ఇంతపని జరిగిందీ! నాలుగు కేకలెట్టేటప్పటికి రోషమువచ్చిందికాబోలు గాడిదకొడుక్కి! పోనీ వెధవని, పోతేపోతాడు. వాడు వాడు కొడుకూ కాదు. మంచిబుద్ధులు నేర్చుకోరా వెధవాయ్ అని తండ్రి చెప్పటం తప్పా! కుక్కలకొడుకు. రేపో మాపో చచ్చే వాణ్ణి న్నివిధాల యేడిపిస్తున్నాడూ? దరిద్రుణ్ణి చావనీ...చావనీ...యెల్లాగా యీపాటికి యేపంపుంతావతలో చచ్చే వుంటాడులే! ఇంక నడు వెంకన్నా, ఇంటికి పోదాం..." కేక పెట్టుకుంటూ వెంకన్న భుజంమీద చెయ్యివేసి మెల్లగా యింటికి బయలు దేరాడావృద్ధుడు. అతని దుఃఖాన్ని ఉపశమింప చేద్దామనే ఉద్దేశంతో రావిచెట్టు ఆ వైపు కరిగి నోటిమాటలు బయటికిరాక పోవుటచే నిస్తబ్ధ

యై తిరిగి యథాస్థానాన్ని ఆక్రమించింది. అతడు పోయేవరకు జాలిగా ఆ వైపే చూస్తూనిలబడింది!

గుమ్మం యెక్కుతుండానే భార్యశోకం వినిపించింది. అంతవరకు కోపంతో రౌద్రరూపాన్ని దాల్చిన అతని వదనము విషాదాన్ని చూపసాగింది. భార్య గుమ్మానికడ్డుగావచ్చి "ఉన్న ఒక్క కొడుకుని తిట్టి పంపించేశారుగదా! ఇదిగో యిప్పుడు మిగిలిందంతా బాముకుని అనుభవించండి మీరు. తిండి తిప్పలులేక యే యిసకపఱ్ఱలో నడిచిపోతున్నాడో వెఱ్ఱితండ్రి! గుమ్మాలు దాటివెడితే తిరిగొచ్చేటప్పటికి కాళ్లుయెఱ్ఱగా కందిపోయావే! యెక్కడికి పోయాడో అప్పుడో యెక్కడికి పోయాడో...తిరిగి మనకి కనిపిస్తాడో..." ఆ మాతృకంఠం రుద్ధమైపోయింది, పక్కనున్న చాపమీద కూలబడి వెక్కివెక్కి యేడుస్తోంది...."చావనీ వెధవనీ"అని విసురుగా లోపలికిపోయి కుర్చీలోకూర్చున్నాడు. చెర్లో యెడ్లకినీళ్ళుపెట్టేందుకు వెంకన్న నిష్క్రమించాడు.

ఎంతవిసురుగా లోపలికి పోయినా రామశాస్త్రి హృదయం బరువుగాలేకపోలేదు. ప్రొద్దున్న కొడుకుని కూకలెయ్యటం పొరపాటే కూడా అనుకున్నాడు మొదలు—పొరబాటు! కన్నకొడుకును సరియైనతోవలో పెట్టినందుకు కూకలెయ్యటంతప్పా నాలుగు యింగ్లీషు ముక్కలు చదువుకొని యింటికొచ్చినంతమాత్రాన పని పాటలు చేసుకోకూడదూ? పొలానికెడితే దొరగారి శరీరం కందిపోతుందికా? ఇంతవృద్ధాప్యం వచ్చినా ఆపన్లన్నీ నాకు తప్పవూ? అతనిశరీరం ఉడికిపోయింది. ఆస్థితిలో ఉన్న యేతండ్రికి కొడుకుమీద ప్రేమ, దయ పుట్టుకొస్తాయి. చెప్పండి?

ఎదురుగా ఉన్న గోడమీద తన కొడుకు ఫోటో వేళ్ళాడుతోంది. గబాగబా రెండుఅంగల్లో ఆ గోడదగ్గరకెళ్ళి ఫోటోనిచేత్తో పట్టుకొని నేలమీదికి విసరబోయాడు. తిరిగి అతనికి పశ్చాత్తాపం కలిగింది...ఎంతకైనా తనకొడుకు తనకన్న చిన్నవాడే తెలీకతప్పు త్రోవతొక్కినంతమాత్రాన—వాణ్ణిక్షమించి తీరాలి అని అతని ఆత్మ ఘోషించినట్లైంది. ఫోటో గోడకి తగిలించి తిరిగి కుర్చీలో నడుంవాల్చాడు. అతని మనస్సునకు విశ్రాంతేలేదు ఆలోచనా పరంపరలు ఒకదాని వెనుకఒకటి ప్రవేశిస్తున్నాయి. ఒకసారి రౌద్రం మరొకసారి కరుణా యింకొకసారి నిరాశ, నిస్పృహా అతనిలో అంతర్భూత మౌతున్నాయి.

కుర్చీలోంచి లేచి కాలుగాలిన పిల్లిలా గదిలో యిటూ అటూ తిరుగుతున్నాడు, మధ్యమధ్యన "నాతండ్రే అయివుంటేనా?" అని పెదిమలు చప్పరించేవాడు—"పాపం కొన్ని రోజులు పోయినతర్వాత వాడే నేర్చుకుంటాడు—" అనుకునేవాడు మళ్ళీ చిన్నాడే యేమన్నానా? అతని ముఖం తీవ్రత దాల్చేది! నలుగురో నాకెంత అగౌరవం తెచ్చాడూ? ప్రతీచెత్తకాని వెధవమూలాని రామశాస్త్రిగా

ఆయుర్వేద వైద్యనిలయం - వారి

"లూకోరియాక్యూర్"

అద్భుత కుసుమరోగనివారిణి.

స్త్రీలకు తరుచు సంభవించు శ్వేతరక్త ప్రదరరోగములకు, బహిష్టు నొప్పులకు దివ్యౌషధమని 10 సం॥ అనుభవముచే చెప్పగలుగుచున్నాము. ఇంకను దీనిని సేవించుటవలన ఇతర గర్భాశయ వ్యాధులను కూడ నిర్మూలించి వంధ్యత్వమును తొలగించును. అనేక మంది దీర్ఘరోగులకు వాడి గుణము కనుగొనబడిన ఆయుర్వేద ఔషధము.

90 మాత్రల ప్యాకెట్టు—వెల రు. 2-8-0.

ప్యాకింగు పోస్టేజి అదనము.

ఆయుర్వేద వైద్యనిలయం

రామానాయుడుపేట, మచిలీపట్నం.

అన్ని మందుల షాపులలోనూ దొరకును.

అబ్బాయి ఇంట్లోంచి పారిపోయాడంటోంటే ఎలా వినగలడు? క్రిందటి జన్మలో యెంతపాపంచేసి యిటువంటి పుత్రుణ్ణికన్నానో! భగవంతుడా! యీ ముసలి ముసలికంయొక్క ప్రాణాలు త్వరగా మింగేద్దూ! అని విచారంగా కుర్చీలో కూలబడ్డాడు. ఆగదిలో అంధకారం ఆవరించినట్లుంది. అతనికి అసలేయెండదెబ్బ తగిలిందేమో బుఱ్ఱ గిఱ్ఱని తిరిగిపోతున్నట్లనిపించింది. అతనికి పడిపోతానేభయంతో కుర్చీలోంచి దిగి మెల్లిగా చాపమీద బోర్లపడుకున్నాడు. అతని మెదడులో మరచక్రాలు పనిచేస్తున్నాయి.

మధ్యాహ్నం దాటింది. సాయంత్రం అయింది. వెంకన్న సావిట్లోకి వెళ్ళి ఉలవలు తీసుకుందుకు యింట్లోకాలుపెట్టాడు. ఆయిల్లు శూన్యంగా కనిపించింది. గోడమీద ఉన్న ఒక గొజ్జెంక అతనిచేతిమీదికి దూకింది. దాన్ని విదిల్చిపారేశాడు. యింటి పెంపుడుపిల్లి మీసాలు నిక్కబొడుచుకుని అతని యెదురుగా వచ్చింది. అటకమీది గబ్బిలం అతని తలమీంచిమాటి అవతలకిదాటిపోయింది. అతనిమనస్సు అపాయాన్ని ఊహించింది. గబాగబా యజమాని పక్కకి పరిగెత్తాడు. దుఃఖంతో తిరిగి వాకిట్లోకొచ్చేసరికి అక్కడ అమ్మగారు ఆమెకూడా అప్పుడే భర్త సన్నిధికి వెళ్ళిపోయింది. నేత్రములనుండి వెలువడిన కన్నీటి వెలువలు అతని భుజముమీది యెఱ్ఱటి గుడ్డని తడిపివేసినై——

ఇప్పుడు వెంకన్నే రామశాస్త్రికిసంబంధించిన యావత్తు స్థరచరాస్తుల్ని జాగ్రత చేస్తున్నాడు అతను శాస్త్రికొడుకురాకకై రోజూయెదురుచూస్తున్నాడు.

“ప్రతిరాత్రి ఒకమొగ పిశాచం ఒకఆడ పిశాచం మంచందగ్గరగాకూర్చుని తమకొడుకు యెప్పుడొస్తాడో యెప్పుడు తమకి విముక్తి కలుగుతుందో అని చర్చించుకొంటూ ఉంటాయి” అని వెంకన్న అప్పుడప్పుడు ప్రతీవ్యక్తితో చెబుతూ ఉంటాడు. “ఆ పుత్రుడు యెప్పుడు వచ్చి ఆమాతాపితల హృదయ తాపం చల్లార్చునో కదా” అనుకుంటూ వెంకన్న ఆయింట్లో ఒంటరిగా తిరుగుతూ ఉంటాడు.


## ఉదయం ఆయాసం

దేహములోని శక్తి అధికముగా వ్యయమౌటవల్లనే నిస్సత్తువ యేర్పడుతుంది. అధికముగా వ్యయమయ్యే యీ జీవశక్తిని తిరుగా సమకూర్చుకొనుటకు సకాలములో శ్రద్ధవహింపకపోతే, మీ దేహము దారుణమైన బలహీనతకు యెరయౌతుంది. కనుక వెంటనే జీవామృతముద్వారాఅధికశక్తిని సమకూర్చుకోవలెను. జీవామృతములోని ప్రతియొక్క బిందువు పుష్టిదాయకమైనది; చైతన్యదాయకమైనది. అంతేగాక ఆరోగ్య బలములను ప్రసాదించును. ఏబది సంవత్సరములుగ ప్రసిద్ధిగన్న భారతీయ టానిక్కు జీవామృతము అని సర్వదా జ్ఞాపకముంచుకొనుడు.



ఇంతటి దారుణమైన నీరసాన్నికూడా నిర్మూలించగల ఉత్తమ రసాయనం.

జీవామృతము

(అన్ని మందుల షాపులలోను దొరకును)
ఆయుర్వేదాశ్రమము లిమిటెడ్,
79, గోపతి నారాయణచెట్టి రోడ్,
త్యాగరాయనగర్, మద్రాసు.